క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సోమల: మండలంలోని కందూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీరమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం జరుగుతుందన్నారు. నిపుణులైన వైద్యులు ఎముకలు, కిడ్నీ, నరాలు, ముక్కు, చెవి ఊపిరితిత్తుల సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్హులైన వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి



చలివేంద్రాన్ని ప్రారంభంలో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): వేసవిలో ఎండబారిన పడకుండా ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు పాటించాలని ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో పాదచారుల తాకిడీ ఎక్కువగా ఉంటుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాటర్‌షెడ్ పనులపై సమీక్ష

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఎంపికైన పంచాయతీల్లో వాటర్‌షెడ్ పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాటర్‌షెడ్ పనులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనులకు నిధులు మంజూరు అయ్యిందని, వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, వైస్ ఎంపీపీలు రాశి ప్రసాద్, ఈశ్వరి గోవర్ధన్, నాదమునిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

పులిచెర్ల(కల్లూరు): ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని చిత్తూరు ఏడీఏ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం కల్లూరులోని ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేసారు. ఎరువులతోపాటు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు అమ్మాలని సీజన్ వారీగా రైతులకు కావలసిన ఎరువులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యమైన ఎరువులు విక్రయించడంతో పాటు దుకాణం ముందు ధరల పట్టిక బోర్డును ఉంచాలన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గంగవరం: కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలించిన కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. కర్ణాటక నుంచి మద్యం తరలిస్తూ శుక్రవారం పొన్నమాకులపల్ల వద్ద కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటన విదితమే. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒక వ్యక్తి తప్పించుకు పారిపోగా, మరోవ్యక్తి చిత్తూరుకు చెందిన అక్రంబాషాను పోలీసులు శనివారం పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్పందించిన హృదయాలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

గుడుపల్లె : అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేసి వారు అభినందనలు అందుకున్నారు. గుడుపల్లె మండలంలోని బెగ్గిలిపల్లె సమీపంలో రెండు రోజుల కిందట ఓ 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. మృతదేహాన్ని గుడుపల్లె పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల నుంచి ఆమె తరపు వారు ఎవరూ రాక పోకవడంతో గుడుపల్లె పోలీసులు, సింగిల్ విండో మాజీ చైర్మెన్ నాగభూషణం, పలువురు శనివారం మృతదేహానికి దగ్గరుండి దహనక్రియలు జరిపించారు. వీరి సేవలను గ్రామస్తులు అభినందించారు.

చేపల చెరువుల వేలం రేపు

సోమల: అన్నెమ్మగారిపల్లె, పేటూరు, పెద్ద ఉప్పరపల్లె పంచాయతీల్లో చేపల పెంపకానికి చెరువులు, కుంటలను సోమవారం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మసూదా బేగం తెలిపారు.శనివారం ఆమె మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి పనులు విస్తృతంగా కల్పించండి

- భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి
- మండల సమావేశంలో ఎమ్మెల్సీ భరత్
- ఉపాధి ఏపీఓ పనితీరుపై సభ్యుల అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలో కూలీలకు ఉపాధి పనులు విస్తృతంగా కల్పించాలని ఎమ్మెల్సీ భరత్ ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో ఏపీఓ అనిల్ అలసత్వం కనబరస్తున్నారన్నారు. మండలంలో పనులు లేక కూలీలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. పలుసార్లు కూలీలకు పని కల్పించాలని ఏపీఓకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ మండలంలో ఉపాధి పనుల సంఖ్య పెంచి జాబ్ కార్డులున్న వారందరికీ పనులు కల్పించాలని ఏపీఓను ఆదేశించారు. అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మండలంలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేసే విషయమై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామాల్లో వైద్య సేవలు విస్తృతం చేసి 104 సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల పనుల బిల్లులను పెండింగ్ లేకుండా చెల్లించాలని హౌసింగ్ అధికారులకు ఎమ్మెల్సీ భరత్ సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి(సర్పంచ్), పార్టీ కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్ప గౌడు, తహసీల్దార్ మురళి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు శ్రమిస్తాం



పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న నాయకులు

శాంతిపురం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తామని పార్టీ జిల్లా అనుబంధ సంఘాల పదవులు పొందిన నాయకులు తెలిపారు. నూతనంగా పదవులు పొందిన వారిని శనివారం మండల పార్టీ ఆధ్వర్యంలో సత్కరించారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘురామిరెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అశ్వత్‌బాబు, బీసీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు వీరభద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాగర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి



ఆవులపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

పులిచెర్ల(కల్లూరు): పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతు ఎంఎల్‌సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి కోరారు. పులిచెర్లలో శనివారం శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో పట్టభద్రులను కలిసి శామ్‌ప్రసాద్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, నాయకులు నాదమునిరెడ్డి, మధు, ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం

సోమల: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ ఈశ్వరయ్య కోరారు. శనివారం ఆవులపల్లె పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు ఆమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, సర్పంచ్ కొదండ రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మల్లప్ప, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సైనిక్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

పుంగనూరు: పట్టణంలోని శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమి విద్యార్థులు సైనిక్ స్కూల్ పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు హర్షిణి, లీలారెడ్డి, వర్షిత, యశ్వంత్‌సాగర్, మేఘన, యశ్వంత్‌సాయితేజ, పూజాప్రవస్తితో పాటు 32 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రాహ్మణపల్లె విద్యార్థి..



మోహన్

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలం బ్రాహ్మణపల్లె ఎంపీపీ పాఠశాల 5వ తరగతి విద్యార్థి ఎం.మోహన్ సైనిక్ స్కూలుకు ఎంపికయ్యాడని ఎంఈఓ హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం విడుదలైన ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్సు ఫలితాలలో ర్యాంకు సాధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

వాసవి శిక్షణ కేంద్రం విద్యార్థులు



పునీత్‌సాయి



విష్ణుప్రియ

పుంగనూరు: పట్టణంలోని శ్రీవాసవి సైనిక శిక్షణ కేంద్రం విద్యార్థులు 21 మంది సైనిక్ స్కూల్ పరీక్షలకు ఎంపికైయ్యారు. ఏ.పునీత్‌సాయి 262 మార్కులు సాధించాడు. అలాగే ఆర్ ఎస్.విష్ణుప్రియ 205 మార్కులు సాధించింది. ఇందుశ్రీ, విమల్‌కృష్ణ, హర్షవర్ధన్‌రెడ్డి, భవ్యశ్రీ, లాస్య, తరుణశ్రీ అధిక మార్కులు సాధించారు. వీరందరూ రవీంద్రభారతి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. వీరిని ప్రిన్సిపాల్ యల్లమ్మ, డైరెక్టర్ వాసు, సిబ్బంది అభినందించారు.

సుగుటూరు గంగమ్మకు గొడుగుల కానుక



గొడుగులను అందజేస్తున్న భానుప్రసాద్, రాజు

పుంగనూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీసుగుటూరు గంగమ్మ ఆలయానికి తిరుపతి నగరపాలక కార్యాలయ ఆర్‌వో, గతంలో పుంగనూరు కమిషనర్‌గా పని చేసిన కేఎల్‌వర్మ చెన్నైలో తయారు చేయించిన గొడుగులను కానుకగా అందజేశారు. మార్చి 14న అమ్మవారి జాతర జరగనుంది. ఈ సందర్భంగా గొడుగులను కమిషనర్ తరపున పట్టణానికి చెందిన ఎస్టీ సంఘం నాయకుడు భానుప్రసాద్, దళిత సంఘ నాయకుడు రాజు మేళతాళాల నడుమ ఊరేగింపు వచ్చి గొడుగులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజు, చిన్నరాయులు, పెంచుపల్లి కృష్ణప్ప, జయరాం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు

పుంగనూరు: రహదారి నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. శనివారం ఎంవీఐ రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ డ్రైవర్లు అజాగ్రత్తగా నడిపి ప్రమాదాలకు గురిచేస్తే బస్సులోని ప్రజల కుటుంబాలు వీధిన పడుతాయని తెలిపారు. అలాగే మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, అతివేగంగా వెళ్లడం ప్రమాదకరమన్నారు. వాహనాలను సార్థకంగా వినియోగించుకోవాలని, వాటితో ప్రమాదాలు తెచ్చుకోకూడదని సూచించారు. ముఖ్యంగా యువకులు ద్విచక్రవాహనాలతో ఫీట్లు చేస్తూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతూ తల్లిదండ్రులకు వేదన మిగిలిస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై పోలీసులు, రవాణాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రతలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్, ఎస్ఐ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ రేపు

సోమల: మండలంలోని ఆవులపల్లెలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. మార్చి 9వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఈనెల 27న అంకురార్పణ జరుగుతుందని పేర్కొంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజూ ఉదయం, రాత్రి పలు వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని ఆ ప్రకటనలో తెలిపింది.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



పెద్దమల్లెల అడవిలో ఫైర్‌లైన్స్ పనులు

రొంపిచెర్ల: సమాజ సంపద అడవుల పరిరక్షణ అందరి బాధ్యతని మంగళంపేట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గిరీశం అన్నారు. శనివారం పెద్దమల్లెలలో అటవీ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవుల్లో వన్య ప్రాణులను వేటాడడం నేరమన్నారు. పక్కన ఉన్న ప్రయివేటు భూముల్లో నిప్పు పెట్టడం వల్ల అడవులు అంటుకుని తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అనుమతి లేకుండా అడవులలో ఎవరు సంచరించకూడదని తెలిపారు. ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఫైర్‌లైన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.32 వేలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రెండు కిలో మీటర్ల దూరం ఫైర్‌లైన్స్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. బీట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, వీఎస్ఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

వేలంతో రూ.26.50 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వి.కోట: వి.కోట మేజర్ పంచాయతీకి సంబంధించి వివిధ నిర్వహణల వేలం ద్వారా రూ.26, 50, 000 ఆదాయం లభించినట్లు సర్పంచ్ పీఎస్ లక్ష్మి తెలిపారు. స్థానిక ప్రధాన గ్రామ సచివాలయ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మి అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. సంత మార్కెట్ వేలం ద్వారా రూ.2 లక్షల 55వేలు, డైలీ మార్కెట్‌కు రూ.4 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ. 9,05,000, వారపు పశువుల సంతకు రూ.4,20,000, జంతు వధశాలకు రూ.15,000, గొర్రెలు, మేకల సంతకు రూ.4,75,000, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణకు 1,80,000 వేలం పాటల ద్వారా ఆదాయం సమకూరినట్లు సర్పంచ్ వివరించారు. ఈఓ యాదవపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు పాల్గొన్నారు.

నియామకం



కుర్రా మోహన్

సోమల: జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కుర్రా మోహన్ నియమితులయ్యారు. ఈమేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిన్నరెడ్డి బాబు నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

పూతలపట్టు: ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా వయోజన విద్య డీడీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ పోలింగ్ బూత్‌లో నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత నంబర్ 1 ఓటు వేయాలని సూచించారు. ఈసీడీసీ పీడీ పద్మజ, ఎంఈఓ కృష్ణారెడ్డి, హెచ్ఎం దామోదరనాయుడు, కె. హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పుంగనూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీకల్యాణ వెంకట్రమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మార్చి 9వ తేదీ వరకు 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో స్వామివారు రోజుకో వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా మార్చి 6న కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కాగా, శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకటరమణస్వామిని విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

సాదాసీదాగా మండల మీట్

పలమనేరు: పలమనేరు మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రోజా అధ్యక్షతన జరిగింది. ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ కారణంగా సమావేశాన్ని సాదాసీదాగా నిర్వహించారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై సంతకాలను చేసి సమావేశాన్ని ముగించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక రంగనాథ్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి



రాంనగర్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: ఉగాది పండుగ రోజున నూతన గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన గూడూరుపల్లె, రాంనగర్ కాలనీల్లో పర్యటించి జగనన్న కాలనీల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గ కేంద్రంలోని కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అలాగే టీడ్కో గృహాలు సిద్ధమయ్యాయని తెలిపారు. కాలనీల్లో రోడ్లు, పైపులైన్లు, విద్యుద్దీకరణ పనులు, కాలువల నిర్మాణం జరుగుతున్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు గృహాలను ఉగాది లోపు పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలన్నారు. అవసరమైన సామాగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాదేశాల మేరకు ఉగాది రోజున అధిక సంఖ్యలో గృహ ప్రవేశాలు చేసి ఆదర్శంగా నిలవాలని కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కేశవాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన బోధన అందుతోందని జిల్లా సమగ్ర శిక్షణ కో ఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని గూడూరుపల్లె హైస్కూల్‌ను సీడీవో సుజాత, ఏపీఎం లావణ్యతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన, వార్షిక ప్రణాళికలు, మధ్యాహ్న భోజనం, దీక్షా యాప్, పరిశుభ్రత, ట్యాబ్‌ల వినియోగం, నూతన గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో రకరకాల అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు ఇంటికి వెళ్లి బోధన చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ , భవిష్యత్తుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహేష్‌నారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ రమణప్ప, ఉపాధ్యాయులు జీవీ రమణ, నరసింహులు, రాజేష్, శారద తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి

బైరెడ్డిపల్లె : పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ప్రకాశం సూచించారు. మండలంలోని పాతపేటలో శనివారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించాలన్నారు. గ్రామస్తులను వైద్య సేవలపై ఆరా తీశారు. వ్యాధి నిరోధక టీకాలు, వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ సిస్టంను పరిశీలించారు. అనంతరం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మేజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్‌పై ఆరా తీశారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర, ఫ్యామిలీ వైద్యాధికారి శాలిని పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



సీమంతం చేసుకున్న గర్భిణులతో వనిత వాసవీ క్లబ్ సభ్యులు

పలమనేరు: పట్టణంలోని వాసవీ క్లబ్ ఆఫ్ వనిత ఆధ్వర్యంలో శనివారం సామూహిక సీమంతాల కార్యక్రమం జరిగింది. మండలానికి చెందిన 25 మంది గర్భిణులకు పౌష్టికాహారంతో పాటు పండ్లు, చీరలు అందించి సీమంతం చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసీడీఎస్ అధికారిణినితోపాటు నిర్వాహకులు ఉషా, దీపికా, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

గుడిపాల: వన్యప్రాణుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తూర్పు అటవీ విభాగం అధికారి దేవరాజులు అన్నారు. క్రిష్ణజమ్మాపురంలో శనివారం ఆయన గ్రామస్తులతో అటవీ మరియు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవరాజులు మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షాలు సకాలంలో కురవక కరువు కాటకాలు సంభవిస్తాయని చెప్పారు. అడవి జంతువులను వేటాడడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అడవి జంతువులను వేటాడిన వారిపై వన్యప్రాణి హక్కు చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా అడవికి నిప్పు పెట్టినట్లు తెలిసినా 9440810288కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.